

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఇఒ

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలోని బొండపల్లి కాంప్లెక్స్ పరిధిలోని. బొండాపల్లి, గోమాంగి, రాయిమామిడి, పోయిపల్లి పాఠశాలను మండల విద్యాశాఖాదికారి కొమ్ము కృష్ణమూర్తి బుధవారం తనిఖీ చేశారు. ముందుగా గోమాంగి మినీ గురుకులం పాఠశాలలో తనిఖీ చేసి పాఠశాల రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. రాయిమామిడి. పాఠశాలలో ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ,ఇటీవల నిర్వహించిన ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలకు వచ్చిన మార్కులు. విధిగా అప్లోడ్ చేయాలన్నారు. మార్కుల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక.శ్రద్ధ వహించాలన్నారు.100 రోజుల. యాక్షన్ ప్లాన్ విధిగా అమలు చేయాలన్నారు.



ప్రశ్నలు అడుగుతున్న ఎంఇఒ

గిరిజన మ్యూజియాన్ని త్వరితంగా నిర్మించాలి

- కొత్తగా టెండర్లు పిలవాలి -గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సదా భార్గవి



పిఒ, మాజీ ఎమ్మెల్యేతో కలిసి పర్యటిస్తున్న సదా భార్గవి

ప్రజాశక్తి-చింతపల్లి : లంబసింగిలో గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సదా భార్గవి తెలిపారు. మ్యూజియం నిర్మాణం పనులకు కొత్తగా టెండర్లు పిలవాలని ఆదేశించారు. లంబసింగిలో స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మ్యూజియం నిర్మాణంలో తీవ్రమైన జాప్యం జరుగుతుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త టెండర్లు పిలిచి పాత కాంట్రాక్టర్‌ను తొలగించి కొత్తగా నిర్మాణ సంస్థలకు పనులు అప్పగించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వచ్చే జనవరి 8వ తేదీ నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. 16వ తేదీ నుండి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. మ్యూజియం నిర్మాణం పనులు మూడు విభాగాలుగా విభజించి మూడు నిర్మాణ సంస్థలకు పనులు అప్పగించాలని పేర్కొన్నారు. పనులన్నీ ఏకకాలంలో పూర్తి కావాలని సూచించారు.వచ్చే మార్చి నెలాఖరు నాటికి పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. మ్యూజియం అంతర్భాగంలో విద్యుత్ కాంతులు, విద్యుత్ దీపాల ఏర్పాట్లు, ఉద్యానవను పనులకు ఆయా రంగాలలో అనుభవం ఉన్న సంస్థలకు పనులు అప్పగించి సుందరీ కరణ చేయాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు మ్యూజియం నిర్మాణంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్, ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకర్‌రావు, ఎం.వెంకటేశ్వరరావు, టి ఆర్ ఎం ఈడి మందా రాణి, ఈఎన్ సి శ్రీనివాస్, ఈఈ జి.డేవిడ్, ఈ యాద కిషోర్, ట్రైకార్ అసిస్టెంట్ సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తాం

- మహాసభలకు సహకరించిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు

- సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి-రంపచోడవరం

గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తామని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, మట్ల వాణిశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు కంభం శాంతిరాజుతో కలిసి కిరణ్ బుధవారం రంపచోడవరంలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. స్థానిక ఆర్‌పి ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 16, 17 తేదీలలో రెండు రోజులపాటు జరిగిన సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా మహాసభల్లో చేసిన తీర్మానాలను మీడియా సమావేశంలో వెల్లడించారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలని, గిరిజన ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని, 1/70, అటవీ హక్కుల చట్టాలను ప్రతిష్టంగా అమలు చేయాలని, గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కిరణ్ డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, రైతుల పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పనకు చట్టం చేయాలని, మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు పెంచాలని, 200 పని దినాలు కల్పించాలని, కనీస కూలీ రూ.600కు పెంచాలని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని, విశాఖ ఉక్కు, కడప స్టీల్ ఫ్యాక్టరీలకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలపై జరుగుతున్న దారులను అరికట్టాలని, మహిళా రక్షణ చట్టాలను ప్రతిష్టంగా అమలు చేయాలని, వలస ఆదివాసీ గ్రామాలలో మౌలిక సౌకర్యాలు మెరుగుపరచాలని, కులాన్ని నిర్ధారించి కులం ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో 19 మందితో జిల్లా కార్యవర్గం, ఆరుగురితో జిల్లా కార్యదర్శివర్గం ఎన్నికైనట్లు చెప్పారు. ఈ మహాసభలు విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కిరణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

అరకులోయను సందర్శించిన ఒడిశా డిప్యూటీ సిఎం

ప్రజాశక్తిఅరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకు లోయలో ఒడిశా రాష్ట్ర డిప్యూటీ సీఎం ప్రవతి పరిదా బుధవారం అరకు లోయలో పర్యటించారు. హెలికాప్టర్‌లో అరకులోయకు చేరుకున్న ఆమె ముందుగా పర్యాటక శాఖ అతిథి గృహానికి చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా సుంకరమెట్ట ఏపీఎఫ్‌డిసి కాఫీ ప్లాంటేషన్‌ను సందర్శించారు. అరకు ప్రాంతంలో పండిస్తున్న కాఫీ ప్రపంచ ప్రఖ్యాతి పొందిన దృష్ట్యా ఇక్కడి కాఫీ విషయమై ప్రత్యేక పరిశీలన చేసి తమ రాష్ట్రంలోని కొరాపుట్‌లో ఇదే తరహా వాతావరణ ఉన్న దృష్ట్యా అక్కడ ప్రారంభించే ఆలోచనలో తమ ప్రభుత్వం ఉందన్నారు. ఈ విషయమై సమగ్ర పరిశీలన జరిపేందుకు వచ్చామని ఆమె అన్నారు. సుంకరమెట్టలో కాఫీ ప్లాంటేషన్ సందర్శించి వుడెన్ బ్రిడ్జి పై నుంచి డిప్యూటీ సీఎం నడిచి కాఫీ తోటల అందాలను ఆహ్వాదించారు. అనంతరం అరకు ట్రైబల్, కాఫీ మ్యూజియం, గిరి గ్రామదర్శిని సందర్శించారు. కాఫీని తాగి రుచి చూసారు. గిరి గ్రామదర్శినిలో గిరిజన సాంప్రదాయ వస్త్రాలంకరణను అలంకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్,



గిరిజన సంప్రదాయ దుస్తులతో పర్యటిస్తున్న ఒడిశా డిప్యూటీ సిఎం

కొరాపుట్ కలెక్టర్ క్రితిహాసన్, ఎస్పీ రోహిత్ శర్మ, అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, ఏపీ ఎఫ్ డి సి డి ఎం కృష్ణ బాబు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పట్టం పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు బుధవారం నిర్వహించారు. స్థానిక పాస్టర్ యోహాను ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంచిపెట్టి . సేవకులను సన్మానించారు.ముఖ్యఅతిథిగా అంజూరి ఫిలిప్ తిమోతి పాల్గొని దైవ సందేశం అందించారు. క్రీస్తును హృదయంలోకి ఆహ్వానిం చడమే నిజమైన క్రిస్మస్ అని ఆయన దైవ సందేశాన్ని బోధించారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట ఫెలోషిప్ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, పాస్టర్స్ రాజారావు, సమూయేలు, ఫిలిప్, డేవిడ్ ప్రసాద్, మల్లన్న, ఆనంద్, విశ్వాసులు పాల్గొన్నారు.



వాగ్దాన కార్డులను అందజేస్తున్న పాస్టర్లు

మైదాన ప్రాంత గిరిజనుల ఆర్థికాభివృద్ధికి చర్యలు

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

మైదాన ప్రాంతంలోను, సబ్‌ప్లాన్ ఏరియాలోను ఉన్న గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని గిరిజనులను వందన్ వికాస కేంద్రాల ద్వారా అభివృద్ధి చేయడానికి ప్రాజెక్ట్ అధికారి బుధవారం తన చాంబర్లో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, వెలుగు ఎపిడి, డిపిఎంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ మైదాన ప్రాంతంలో ఉన్న అన్ని గిరిజన తెగలకు సంబంధించిన ఆధార్ కార్డులతో సహా జాబితా తయారు చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎరుకలు, చెంచులు, యానాద కులాలకు సంబంధించిన గిరిజనులు మండలాల వారీగా ఎంతెంత మంది ఉన్నారు, వారు ప్రస్తుతం ఏయే పనులు చేసుకుంటున్నదీ ఆరా తీశారు. వారికి వందన్ వికాస కేంద్రాల ద్వారా మినీ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. వందన్ వికాస కేంద్రాల ద్వారా 300 మందిని ఒక గ్రూపుగా ఏర్పాటు చేస్తామన్నారు. మైదాన ప్రాంత గిరిజనుల అభివృద్ధికి వెలుగు డిపిఎం పరమేశ్వరరావును నోడల్ అధికారిగా నియమించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, వెలుగు ఏపీడి డేగలయ్య, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు రామ తులసి, కృష్ణమోహన్, నాగజ్యోతి, డిపిఎం అపర్ణ, వెలుగు యాంకర్ పర్సన్ రామరాజు పాల్గొన్నారు.

వాలంటీర్లను కొనసాగించాలి

వాలంటీర్ల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు చిన్నయ్య పడాల్



నినాదాలు చేస్తున్న వాలంటీర్లు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-చింతపల్లి: ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాలంటీర్లపై చూపించిన ప్రేమ అధికారం వచ్చిన తర్వాత ఏమైందని వాలంటీర్ల సంఘం అల్లూరి జిల్లా గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ ప్రశ్నించారు. చింతపల్లి జికేవీధి, కొయ్యూరు మండలాల ప్రాంతీయ సమావేశం, వాలంటీర్ల సంఘం చింతపల్లి మండల అధ్యక్షులు వేములపూడి పరమేశ్వరరావు అధ్యక్షతన చింతపల్లి ప్రాంతీయ సమావేశంలో నిర్వహించారు. జిల్లా వాలంటీర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు, ప్రసాదు, కొండబాబు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సమావేశంలో చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రచార సభల్లో వాలంటీర్లకు రూ.10,000 జీతంతో పాటు వ్యవస్థను కొనసాగిస్తామని ఆనాడు చంద్రబాబు నాయుడు అనలేదా అని అన్నారు, ఇప్పుడు అధికారంలో వచ్చిన తర్వాత కనీసం స్పందించలేదని, ఏడు నెలల వేతనాలు లేక వాలంటీర్లు ఆర్థిక భారంతో అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల అరవై వేల మంది కుటుంబాలతో రోడ్డున పడ్డారని తెలిపారు. జగన్మోహన్ ప్రభుత్వం రెన్యువల్ చేయలేదని, బిడ్డ పుట్టకుండానే పేరు ఎలా పెడతామని మంత్రి చెప్పడం సరికాదన్నారు. ఆ ప్రభుత్వం రెన్యువల్ చేయకపోతే కూటమి ప్రభుత్వం ఎందుకు చేయలేదని నిలదీశారు. ఎన్నికలకు ముందు ఒక మాట, గెలిచాక మరో మాట మాట్లాడటం భావ్యం కాదని మండిపడ్డారు.గెలిచిన అహంకారాన్ని పక్కన పెట్టి తిరిగి వాలంటీర్లను వీధిలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, ప్రసాద్, కొండబాబు మాట్లాడుతూ, ఈనెల 26, 27, 28 తేదీలలో మండల కేంద్రాలలో జరిగే రిలే నిరాహార దీక్షలలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. అనంతరం మూడు మండలాల సబ్ డివిజన్ కన్వీనర్లుగా పరమేశ్వరరావు, రవి తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు నాగరాజు, శిరీష, వెంకటేశ్వర్లు, మూడు మండలాల వాలంటీర్లు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

పాఠశాలలో పిక్నిక్ సందడి

ప్రజాశక్తి- జి.మాడుగుల: స్థానిక బీవీకే పాఠశాలల్లో పిక్నిక్‌ను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బీవీకే పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో బివికే ప్రిన్సిపాల్ సూర్య ప్రకాష్, టీచర్స్ పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చింతపల్లి : అల్ప పీడన ప్రభావం కారణంగా రాగల నాలుగైదు రోజుల్లో మన్యంలో కూడా మోస్తరు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాస్త్రవేత్తల సూచనల మేరకు గిరి రైతులు వ్యవసాయ పంటల కోతలు, నూర్పిడిలను వాయిదా వేసుకోవాలని వైస్ ఎంపీపీ గోపినాయక శారద సూచించారు. బుదవారం ఆమె మాట్లాడుతూ, ఈ నెల 19 నుంచి 22 వరకు చింతపల్లి, పాడేరు, అరకు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో వర్షం కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలను, ధాన్యం నూర్పిడిలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని సూచించారు. కోసిన వరి పంటను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించి జాగ్రత్త చేసుకోవాలన్నారు. కోసిన పంటను వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేర్చుకోవాలన్నారు. నూర్చిన ధాన్యాన్ని వెనువెంటనే ఇళ్లకు తరలించుకోవాలని రైతులకు ఆమె సూచించారు.

కాఫీని దళారులకు విక్రయించొద్దు

ప్రజాశక్తి- చింతపల్లి : కాఫీ ఫలాలను దళాలకు విక్రయించి మోసపోవద్దని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ రైతులకు సూచించారు. దళారులు తూకాల్లో మోసం చేస్తారని రైతులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. బుధవారం గొందిపాకలు పంచాయతీ గాది గొయ్యి గ్రామ రైతు కొండపల్లి వెంకటరావు కాఫీ తోటలను పిఒ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూర్తిగా పండిన కాఫీ పండ్లను మాత్రమే సేకరించాలని చెప్పారు. నాణ్యమైనవి సేకరించడంతో మంచి ధరలు వస్తాయని చెప్పారు. గత ఏడాది కాఫీ తోటల్లో ఎంత ఆదాయం వచ్చిందని రైతును అడిగి తెలుసుకున్నారు.గత సంవత్సరం మ్యాక్స్ సంస్థకు సరఫరా చేసిన కాఫీకి ఎంత ధర చెల్లించారని రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది కాఫీ పళ్ళకు కిలో కు రూ.44 మ్యాక్స్ సంస్థ చెల్లిస్తుందని, మ్యాక్స్ కు మాత్రమే సరఫరా చేయాలని రైతులకు ప్రాజెక్ట్ అధికారి సూచించారు. గత సంవత్సరం కాఫీ మిరియాలు సాగులో వచ్చిన ఆదాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు విఎస్ ప్రభాకర్ రావు, ఎం.వెంకటేశ్వరరావు, ఏఈఓ అప్పలనాయుడు, కాఫీ ఫీల్డ్ కన్సల్టెంట్లు, లైజాన్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



కాఫీ తోటలను పరిశీలిస్తున్న పిఒ అభిషేక్

గురుకుల అవుట్ సోర్సింగ్ టీచర్ల భిక్షాటన

రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలిపిన గిరిజన సంఘం, సిపిఎం



భిక్షాటన చేస్తున్న గిరిజన గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-రంపచోడవరం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన గిరిజన గురుకుల పాఠశాలల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు బుధవారం రంపచోడవరంలో భిక్షాటన చేశారు. తమను ఔట్ సోర్సింగ్ నుండి కాంట్రాక్టు విధానం లోనికి మార్పు చేసి, 2022 పిఆర్‌సి ప్రకారం జీతాలు చెల్లించాలని, 2024 డిఎస్‌సి నుంచి తమ పోస్టులు మినహాయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన గిరిజన గురుకుల పాఠశాలల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఐటిడిఏ ఎదుట 33 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విషయం విధితమే. గురుకుల పాఠశాలలను నమ్ముకుని గత 15-20 సంవత్సరాల నుంచి 1659 మంది ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఏ గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ విధానం లేదని, ఒక్క గిరిజన గురుకులాల్లో మాత్రమే ఉందని పేర్కొన్నారు. దీని వల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, చాలీచాలని జీతాలతో పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఔట్ సోర్సింగ్ విధానం రద్దు చేసి తమను కాంట్రాక్ట్ విధానంలోకి మార్చాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు.

గిరిజన సంఘం, సిపిఎం మద్దతు

ఔట్ సోర్సింగ్ టీచర్లు ఐటిడిఏ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని బుధవారం గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు కంభం శాంతిరాజు సందర్శించి తమ సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 33 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు నిరసన తెలుపుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మరో వైపు ఏజెన్సీ ప్రాంత గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సిఆర్‌టిను అంతర్ జిల్లాల డిప్యూటేషన్ల పేరుతో పంపించి గురుకులాల్లో సిఆర్‌టిలను అలానే వదిలేద్దామని భావించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, లేకుంటే రానున్న కాలంలో వారికి మద్దతుగా గిరిజన సంఘం, సిపిఎం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు సనాతనబాబు, కె.ఆదిరెడ్డి, కృష్ణ, ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయుల నాయకులు శామ్యూల్, తాతాజీ, అనంతకుమారి, విద్యార్థి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షులు ఐవి రమణ తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

పంచాయతీల అభివృద్ధికి సమిష్టి కృషి అవసరం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : పంచాయితీల అభివృద్ధికి గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల అధికారుల సమిష్టి కృషి అవసరమని పంచాయితీ ప్రణాళికల కార్యక్రమం అబ్జర్వర్ నిహారిక అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ, వెలుగు తదితర శాఖల మండల అధికారులతో పంచాయతీల సుస్థిర అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఇందులో పాల్గొన్న నిహారిక మాట్లాడుతూ పంచాయతీలలో మౌలిక సదుపాయాలు కల్పనకు తీసుకోవలసిన ప్రణాళికల గూర్చి అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీల సర్పంచ్‌లు, ఏపీవో సురేష్ కుమార్, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు : పంచాయితీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మూడో బ్యాచ్ శిక్షణ తరగతులు బుధవారం నిర్వహించి పూర్తి చేశామని జీకే వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహనకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు చెప్పారు. సుస్థిర అభివృద్ధి సాధనకు చేపట్టవలసిన చర్యలపై పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి ఇఓపిఆర్‌డి, వెలుగు ఏపీఎం సూర్యారావు, పంచాయతీరాజ్ ఏఈ జ్యోతి బాబు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, ఐసిడిఎస్ సిడిపిఓ ఇమ్మానియేల్, వ్యవసాయ శాఖ అధికారి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న అబ్జర్వర్ నిహారిక



కమ్మేసిన మంచు


చలి మంట కాగుతున్న గిరిజనులు

మన్యంలో పెరిగిన చలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఏజెన్సీలో చలి తీవ్రత ఎక్కువ కావడంతో గిరినులు అవస్థలు పడుతున్నారు. తెల్లవార్లు నుంచి దట్టమైన పొగ మంచుతో పాటు చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీనికి తోడు ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ముసురు పట్టడంతో చల్లటి గాలులు వీస్తున్నాయి. దీంతో చలి తీవ్రత మరింతగా ఉంటుంది. చలి తీవ్రతను తట్టుకోవడానికి మండల గిరిజనులు చలి మంటలను వేసుకొని చలికాస్తున్నారు. రాత్రి నుంచి ఉదయం 9 గంటల వరకు చలి ఉండగా ఆ తర్వాత మూడు గంటలు దాటిన తర్వాత చలికాస్తుంది. అత్యవసర పనులు ఉన్నవారు మాత్రమే ఉదయం బయటకు వస్తుండగా మరికొంతమంది 9 గంటల తర్వాతనే బయటకు వచ్చి వారి పనులు చేసుకుంటూ సాయంత్రం నాలుగు గంటల లోపల గ్రామాలకు చేరిపోతున్నారు. ప్రస్తుతం ముసురు పట్టి చలి గాలులు వీస్తుండటంతో జలుబు, దగ్గు, జ్వరం వంటివ్యాధులకు గిరిజనులు గురవుతున్నారు. గత నాలుగైదు రోజుల నుంచి చలి తీవ్రత అధికంగా ఉండటంతో గిరిజనులు పలు ఇబ్బందులు పడుతున్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి


గొట్లగూడెం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న
రంపచోడవరం తహశీల్దార్ రామకృష్ణ

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలంలోని ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం తహశీల్దార్ రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని గొట్లగూడెం గ్రామంలో బుధవారం రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాలైన భూ సమస్యలు, గ్రామ సమస్యలు పరిష్కరించే విధంగా రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భూములకు సంబంధించిన సమస్యలు, హద్దులు, పట్టాలు మార్పుడి వంటి సమస్యల దరఖాస్తులను స్వీకరించి రసీదులు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సంస్థల మండల ప్రత్యేక అధికారి, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, మండల సర్వే లక్ష్మణరావు, ఆర్ఐ సిహెచ్.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : గిఫ్ట్ డిడ్ ద్వారా సాగు భూమిని కుటుంబ సభ్యులకు బహుమతిగా ఇవ్వచ్చని జీకే వీధి మండల తాసిల్దార్ రామకృష్ణ అన్నారు. బుధవారం జికె వీధి మండలం దామనాపల్లి పంచాయతీ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాదారులు తమకున్న భూమిలో కొంత భూమిని వారసులకు గాని కుటుంబ సభ్యులకు గాని గిఫ్ట్ డిడ్ పద్ధతి ద్వారా ఇచ్చుకునే వెసులుబాటు ఉందన్నారు. దావమనపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న రెవెన్యూ గ్రామాల పట్టాదారుల సమస్యలపై అధికారులకు అర్జీలు సమర్పించారని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మహాదేవ్, సర్పంచ్ కె.రామకృష్ణ, మండల సర్వేయరు శ్రీను, రైతులు పాల్గొన్నారు.

పాడేరు:మండలంలోని బడిమెల గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 121 అర్జీలు వచ్చాయని తహసిల్దార్ వి. త్రినాధరావు నాయుడు చెప్పారు. భూ వివాదాలు, ఆక్రమణలు, మ్యూటేషన్లపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రెవిన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు, రెవిన్యూ సిబ్బంది, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



జికె.వీధి మండలం దామనాపల్లి రెవెన్యూ సదస్సులో అధికారులు



అధిక తేమ నుంచి పంట ఉత్పత్తుల రక్షణ